

# పెళ్ళికూతురు

మంగళ వాయిద్యాలు పడుచుగుండెల్లో మరుమల్లెల జల్లుల్ని కురిపిస్తున్నాయి. పెళ్ళికూతురు వరలక్ష్మి ముస్తాబవుతూంది. కొంచెం దూరంలో కూర్చుని వరలక్ష్మిని చూస్తున్న శృతికి ఆమెతో తన మొదటి పరిచయం గుర్తుకొచ్చింది.

"గుడ్‌మార్నింగ్ డాక్టర్!" నవ్వే సెలయేరులా, త్రుళ్ళిపడే జలపాతంలా వున్న ఆ అమ్మాయి వంక ఒక్క క్షణం ఆసక్తిగా చూస్తూ ఉండిపోయింది శ్రుతి.

"మా అమ్మగారికి కొంచెం ఒంట్లో బాగాలేదు. మీరు టెస్ట్‌చేసి మంచి మందులు రాసివ్వండి" నొక్కులు నొక్కుల పొడవాటి జుట్టుతో, చారెడేసి కళ్ళతో, సంపంగి ముక్కుతో, నున్నగా మెరుగులీనుతున్న చెక్కిళ్ళతో, పసిమిరంగుతో బాపూ బొమ్మలా నాజూగ్గా, సుకుమారంగా వున్న వరలక్ష్మి తరువాత చాలాసార్లు శృతి దగ్గరకు వచ్చింది.

ఒక పాదానికి పారాణి పెట్టుకుని, రెండోపాదం కొంచెం ముందుకు చాపి పారాణి పెట్టుకుంటున్న వరలక్ష్మి కళ్ళముందు స్మృతుల పరదాలొక్కొక్కటీ జారుతున్నాయి. కుసుమించిన యౌవనం, అలరించే లావణ్యం, కొత్తగా దొరికన చిరుద్యోగం, ఊహలు, కోరికలు, సుందర స్వప్నాలు. ఈ క్షణం గురించి ఎన్ని అందమైన ఊహల్ని పేర్చుకునేది తను! ఎన్నెన్ని మధుర భావనలతో తూగిపోయేది తను! కాని... కరుణించని కాలం పదిహేను సుదీర్ఘ సంవత్సరాల తరువాతకు విసిరేసిందీ క్షణాన్ని. యిన్నాళ్ళ తన నిరీక్షణ, యిన్నేళ్ళ తన తపన యిప్పుడు ఫలించబోతున్నాయి. పది సంవత్సరాల క్రితం తన తలుపు తట్టిన అవకాశాన్ని యిప్పుడు అంది పుచ్చుకుంది. తనవాళ్ళ స్వార్థం తన కోరికల్ని ఉరితీస్తోందనే విషయాన్ని తనానాడే గుర్తించి వుంటే, తన బాధ్యతల కంటే తన జీవితమే తనకు ముఖ్యమనే రవ్వంత స్వార్థానికి చోటిచ్చి ఉంటే ఎంత బావుండేది?!... పదేళ్ళనాడే తనను యిష్టపడి తన జీవితంలోకి అపురూపంగా ఆహ్వానించిన భాస్కర్రావు భార్య అయివుండేది. తన గుండె లోతుల్లో యింకా బ్రతికేవున్న కోరిక, పెళ్ళికూతురి అలంకరణతో కళ్యాణ వేదికపై అడుగు పెట్టాలనే అందమైన కల ఆనాడే నిజమ యుండేది.. వరలక్ష్మి కళ్ళల్లో కన్నీటి సముద్రం, హృదయంలో ఫలించని ఆశల ఘోష.

శ్రుతి వరలక్ష్మిని గమనిస్తోంది. పదేళ్ళుగా ఆమె జీవితంలో జరిగిన ముఖ్య ఘట్టాలన్నీ శ్రుతికి తెలుసు. ఆమె సంతోషంగా తనకైతాను తలకెత్తుకున్న బాధ్యతలు, ఆ బాధ్యతల భారంతో ఆమె తల వంగిపోవడం, భాస్కర్రావుని తిరస్కరించేలా చేసిన అయినవాళ్ళ స్వార్థం, మరణశయ్యమీద వున్న తల్లికిచ్చిన మాట నిర్దాక్షిణ్యంగా ఆమె బ్రతుకును నలిపేయడం గుర్తుకొచ్చాయి శ్రుతికి.

అన్ని బాధ్యతల్నుండి విముక్తి పొందిన వరలక్ష్మి ఐదేళ్ళనుంచి తోడుకోసం వెదుక్కుంటూంది. మారిపోయిన రూపురేఖలు, జారిపోతున్న యౌవనం, సౌకుమార్యాన్ని కోల్పోయిన కదలికలు... ఎన్నో ఆశాభంగాల్ని సహించి, విసిగి వేసారి యింక వివాహ ఘట్టాన్ని శాశ్వతంగా మరచిపోదామనుకునే సమయంలో పదేళ్ళనాడు ఆమె తిరస్కృతిని మౌనంగా

ధరించి వెళ్ళిపోయిన భాస్కర్రావుకు మళ్ళీ ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ అయింది. పాత పరిచయం, స్నేహం, సాన్నిహిత్యం కొత్త మలుపుకు తిరిగాయి. పెళ్ళయిన ఏడాదికే భార్యను పోగొట్టుకున్న భాస్కర్రావు, ముప్పై అయిదేళ్ళు నిండిపోయిన వరలక్ష్మి ఇద్దరూ ఎవరికి వాళ్ళు సంకోచంతో నిలబడిపోయారు. చివరకు వరలక్ష్మే ధైర్యంచేసి అడుగు ముందుకు కదిపింది.

తీరా ఒక నిర్ణయానికొచ్చాక వరలక్ష్మికో సందేహ మొచ్చింది.

"డాక్టర్‌గారూ! నా వయసింత ముదిరిపోయింది కదా, పిల్లలు పుట్టే అవకాశముందా అసలు నాకు?" బేలగా చూస్తూ అడిగింది వరలక్ష్మి.

"ఎందుకు లేదమ్మా? ఇంకా పది సంవత్సరాల వరకు నీకు పిల్లలు పుట్టడాని కవకాశముంది. నువ్విలాంటి అనుమానాలు పెట్టుకోకుండా సంతోషంగా పెళ్ళి చేసుకో" ధైర్యం చెప్పింది శ్రుతి.

భాస్కర్రావు రిజిస్టర్ మేరేజ్ చేసుకుందామని అంటున్నా వినకుండా సంప్రదాయ బద్ధంగా, శాస్త్రోక్తంగా తన పెళ్ళి జరగాలని పట్టుబట్టింది వరలక్ష్మి. దగ్గర బంధువులు, ఫ్రెండ్స్, కొలీగ్స్... అంతా వచ్చారు. ఆసంరంభం, ఆ అలజడి, ఆ ఉత్సాహం, ఆ ఉద్వేగం... చిత్రమైన మనః స్థితిలో వుంది వరలక్ష్మి.

చేతులకు గోరింటాకు పెట్టుకుంటూ దగ్గరకు వచ్చినవాళ్ళందర్నీ తన అలంకరణ ఎలా వుందని అడుగుతూంది వరలక్ష్మి. ఆమెతో బావుందని చెప్పి చాటుకు వెళ్ళి చెయ్యి అడ్డం పెట్టుకుని ఎగతాళిగా నవ్వుకుంటున్నారు. గుసగుసగా చెప్పుకుంటూ ఎద్దేవా చేస్తున్నారు. వరలక్ష్మిని, వాళ్ళనూ చూస్తుంటే శ్రుతికి బాధగా వుంది. జాలిగా వుంది. తమాషాగా వున్న ఆమె రూపాన్నీ, అలంకరణనూ చూస్తే వెగటుగానూ వుంది.

"మేడమ్! ఎలా వుంది? బావున్నానా?" ఆశగా అడిగింది వరలక్ష్మి. విషాదాన్ని గుం డెల్లో అణచుకుని ముఖానికి చిరునవ్వును పులుముకుని పెదవి విప్పబోయింది శ్రుతి.

"అమ్మవారిలా ఆ అలంకరణేమిటి?- పన్నెండేళ్ళ బాలాకుమారి ననుకుంటూంది కాబోలు!" వరలక్ష్మి చిన్నతమ్ముడి భార్య అలివేణి కావాలనే బిగ్గరగా అని వెటకారంగా నవ్వింది.

గురి బాగా కుదిరింది. గాయం లోతుగా అయింది. ఆ లోతుల్ని స్పృశించి ఉపశమనం కలిగించే మందు శృతి దగ్గరలేదు.